@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
బుధవారం 18 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శబరిమలలో తిరుపతి తరహా
మెగా ప్రాజెక్టు

- కేరళ సీఎం కీలక ప్రకటన
- తిరుపతి మోడల్‌లో శబరిమల అభివృద్ధి.. కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అయ్యప్ప భక్తులకు అత్యాధునిక వసతులు
- సమగ్ర మౌలిక వసతుల కల్పన
- కొచ్చి విమానాశ్రయంలో 5,000 చదరపు అడుగుల్లో ప్రత్యేక సేవా కేంద్రం
- భక్తుల రాకను మరో 50 శాతం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం



వాయు కాలుష్యంలో
40 శాతం బాధ్యత నాదే

- రవాణా రంగం నుంచి వెలువడుతున్న ఉద్గారాలపై కీలక వ్యాఖ్యలు..
- ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగానికి పిలుపు
- రవాణా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు విధాన నిర్ణేతగా తనకూ బాధ్యత ఉంది
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

తుపాన్ల దెబ్బ నుంచి ఏపీని ఆదుకోండి

- కేంద్ర ఆర్థిక సాయం వెంటనే విడుదల చేయండి..
- నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ఆర్నబ్, మురసు తుపాన్లతో రూ.7 వేల కోట్లకు పైగా నష్టం..
- దెబ్బతిన్న పంటలు, విద్యుత్ వ్యవస్థ, తీర ప్రాంత మౌలిక వసతులు



దిల్లీ

వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించి, పునరుద్ధరణ పనులకు సహకరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. దిల్లీ పర్యటనలో భాగంగా ఆమెతో భేటీ అయిన చంద్రబాబు.. ఆర్నబ్, మురసు తుపాన్ల కారణంగా రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారమే రెండు తుపాన్లతో రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రెండు వరుస తుపాన్లు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపాయని చంద్రబాబు వివరించారు. చేతికందే దశలో ఉన్న పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని తెలిపారు. తీర ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం నష్టం రూ.7 వేల - మిగతా3లో



కోనసీమ బ్లోఅవుట్‌పై సీఎం సమీక్ష

- ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యం.. గ్యాస్ లీకేజీని తక్షణమే అరికట్టాలి
- ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చంద్రబాబు ఆదేశం
- ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా.. సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచన

అమరావతి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చోటుచేసుకున్న బ్లోఅవుట్ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్యాస్ లీకేజీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పరిసర గ్రామాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. లీకేజీని అరికట్టేందుకు ఓఎన్‌జీసీ ప్రత్యేక సాంకేతిక బృందాలతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బ్లోఅవుట్ ఘటన నేపథ్యంలో గ్యాస్ లీకేజీ ప్రాంతానికి - మిగతా3లో

భారత్‌లో భారీ పెట్టుబడులకు
అమెజాన్ సై..

- పునరుత్పాదక రంగంపై ఫోకస్
- భారత్‌లో రూ.58 వేల కోట్ల పైచిలుకు పెట్టుబడి
- కర్ణాటక మధ్యప్రదేశ్ రాజస్థాన్‌లలో నాలుగు భారీ ప్రాజెక్టుల ప్రకటన
- 2 గిగావాట్లకు చేరనున్న అమెజాన్ హరిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం



భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

- ఇండో-పసిఫిక్ భద్రతకు క్వాడ్.. ఆసియాన్‌తో వ్యూహాత్మక బంధం!
- శాంతి, స్థిరత్వం, అభివృద్ధే లక్ష్యంగా భారత్ అడుగులు
- మనీలాలో ప్రధాని మోదీ కీలక ప్రసంగం..
- సముద్ర భద్రత నుంచి సెమీకండక్టర్ల వరకు సహకారం..
- ఆసియాన్ దేశాలకు పలు ప్రతిపాదనలు



గత రెండు తుపాన్లతో పోలిస్తే
అక్వాన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చు



- ఈ నెల 20న నెల్లూరు నుంచి తుని మధ్య తీరం దాటనున్న అక్వాన్ తుపాను
- తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు
- తీర ప్రాంత ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని పవన్ కళ్యాణ్ ఆదేశం

అమరావతి

రాష్ట్రంపై మరో ప్రకృతి విపత్తు విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు రక్షణ చర్యలను ముమ్మరం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ప్రభావం రానున్న రోజుల్లో రాష్ట్రంపై తీవ్రంగా ఉండనుందన్న హెచ్చరికల నేపథ్యంలో, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్.డబ్ల్యూ.ఎస్) విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప - మిగతా3లో



విద్వేషం నుంచి విముక్తి కల్పించి ప్రేమను పంచడమే తన విధి

- రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీ కౌంటర్
- సోనియా గాంధీ పుస్తకావిష్కరణలో తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న రాహుల్
- తల్లిదండ్రుల భోజన సమయాల గురించి మాట్లాడిన వ్యాఖ్యలపై విమర్శలు
- విమర్శలకు కౌంటర్‌గా ఎక్స్‌లో శివపార్వతుల శిల్పం ఫొటో పోస్ట్ చేసిన ప్రతిపక్ష నేత

అక్వాన్ తుపాను బీభత్సం

- ఏపీకి అత్యంత భారీ వర్ష సూచన!
- నెల్లూరు--విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- 130 కి.మీ. వేగంతో గాలులు.. అప్రమత్తమైన విపత్తుల నిర్వహణ సంస్థ
- విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా శాఖ ముందస్తు చర్యలు



అమరావతి

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వైపు దూసుకొస్తోంది. దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఈ తుపాను రానున్న గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం ఉదయానికి తీవ్ర తుపానుగా, గురువారం సాయంత్రానికి అతి తీవ్ర తుపానుగా మారవచ్చని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుపాను చెన్నైకు సుమారు 590 కిలోమీటర్లు, మచిలీపట్నం, విశాఖపట్నాలకు దాదాపు 650 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే - మిగతా3లో

మోదీ ప్రభుత్వ విధానాలే ద్రవ్యోల్బణానికి కారణం

- నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి
- నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం..
- ప్రధాని రాజకీయాల్లో బిజీగా ఉన్నారంటూ కాంగ్రెస్ విమర్శ
- ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి



భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

మనీల (ఫిలిప్పీన్స్): ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రపంచ ఆర్థికాభివృద్ధికి పరస్పర సహకారం ఎంతో అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశాల మధ్య పోటీ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. భారత్, ఆసియాన్ దేశాలు కలిసి పనిచేస్తే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన క్వాడ్ సమావేశం, 23వ భారత్-ఆసియాన్ సదస్సుల్లో పాల్గొన్న ఆయన ప్రాంతీయ సహకారం, భద్రత, వాణిజ్యం, సాంకేతికత, పెట్టుబడులపై తన ఆలోచనలను వెల్లడించారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో భారత్ కీలక భాగస్వామిగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

ఇండో-పసిఫిక్‌కు క్వాడ్ భరోసా

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్య దేశాలుగా ఉన్న క్వాడ్ కూటమి కేవలం నాలుగు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని మోదీ పేర్కొన్నారు. మొత్తం ఇండో-పసిఫిక్ ప్రాంతానికి విశ్వసనీయమైన పరిష్కారాలను అందించడమే కూటమి లక్ష్యమని వివరించారు. సముద్ర భద్రత, విశ్వసనీయ సరఫరా గొలుసులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక రంగాల్లో క్వాడ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత్ ఈ కూటమిని నిర్మాణాత్మకమైన, విశ్వసనీయ భాగస్వామ్యంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. 2007లో నాలుగు దేశాల అధికారులు తొలిసారిగా మనీలాలో సమావేశమయ్యారని, 2017లో ఇదే నగరంలో క్వాడ్ చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు 2026లో మరోసారి మనీలాలో సమావేశం కావడం చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు ఐదుసార్లు సమావేశం కావడం పరస్పర నిబద్ధతకు నిదర్శనమన్నారు. క్వాడ్ తదుపరి దశలో మరింత స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య సహకారం మరింత అవసరమని మోదీ అన్నారు. 23వ భారత్-ఆసియాన్ సదస్సులో మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు ప్రాంతాలకు అంతర్జాతీయంగా ప్రత్యేక స్థానం ఉందని గుర్తుచేశారు. శాంతి, స్థిరత్వం, పరస్పర విశ్వాసం ఆధారంగా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్ టుగెదర్' (మన భవిష్యత్తును కలిసి నిర్మించుకోవడం) ప్రస్తుత



ప్రపంచ పరిస్థితులకు ఎంతో అనువైనదని పేర్కొన్నారు. భారత్, ఆసియాన్ దేశాలు సమన్వయంతో పనిచేస్తే ప్రాంతీయంగా ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా అధిగమించవచ్చన్నారు.

యాక్ట్ ఈస్ట్ పాలసీతో కొత్త అవకాశాలు

భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానం ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని ప్రధాని తెలిపారు. గతంలో సాంస్కృతిక, చారిత్రక సంబంధాలకే పరిమితమైన భాగస్వామ్యం ఇప్పుడు డిజిటల్ సాంకేతికత, రక్షణ, అంతరిక్షం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి విస్తృత రంగాలకు విస్తరించిందన్నారు. 2014 నుంచి భారత్, ఆసియాన్ దేశాల మధ్య ప్రజా సంబంధాలను పెంపొందించేందుకు 100కు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. దాదాపు 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులను చేపట్టడంతోపాటు నైపుణ్యాభివృద్ధి కోసం 10 వేలకు పైగా స్కాలర్‌షిప్‌లు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు.

పర్యాటకం, రవాణాకు ప్రాధాన్యం

భారత్, ఆసియాన్ దేశాల మధ్య రవాణా, పర్యాటక రంగాల్లోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు మోదీ తెలిపారు. భారత్ నుంచి ఆసియాన్‌లోని తొమ్మిది దేశాలకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజల మధ్య రాకపోకలు పెరగడం వల్ల పర్యాటకం, వాణిజ్యం, సాంస్కృతిక సంబంధాలకు మరింత ఊతం లభిస్తోందన్నారు. ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల అభివృద్ధి ఒకదానికొకటి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఆసియాన్ ఐక్యతకు, ప్రాంతీయ వ్యవహారాల్లో ఆ సంస్థకు ఉన్న కేంద్ర స్థానానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆసియాన్ దేశాలకు మోదీ కీలక ప్రతిపాదనలు

భారత్-ఆసియాన్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రధాని మోదీ పలు ప్రతిపాదనలు చేశారు. ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈ-వీసాల సౌకర్యం కల్పించడం, దీర్ఘ కాలిక సముద్ర సహకార ప్రణాళిక రూపొందించడం, అణు శక్తి సాంకేతికతలో పరస్పర సహకారం, కీలక ఖనిజాల రంగంలో భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలను ప్రతిపాదించారు. విద్య, యువజన మార్పిడి, పర్యాటకం, ఇంధనం, ఆధునిక సాంకేతికత, సముద్ర భద్రత వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు కొత్త దిశను చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సింగపూర్‌తో పెట్టుబడులు.. సెమీకండక్టర్లపై చర్చలు

మనీలాలో పర్యటన సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై చర్చించారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. 2025 సెప్టెంబర్‌లో సింగపూర్ ప్రధాని భారత్ పర్యటన సందర్భంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుపైనా సమీక్షించారు. త్వరలో ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న లారెన్స్ వాంగ్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

థాయ్‌లాండ్‌తో రక్షణ, భద్రతా సహకారం

థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా అనుసంధానం, డిజిటల్ సాంకేతికత, పర్యాటక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడంపై చర్చించారు. భారత్, థాయ్‌లాండ్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను మోదీ గుర్తుచేశారు. భారత్ యాక్ట్ ఈస్ట్ విధానం, థాయ్‌లాండ్ యాక్ట్ వెస్ట్ విధానం పరస్పరం సహకరించుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. బిమ్‌స్టెక్, మెకాంగ్-గంగా సహకార వేదికలతోపాటు ఇతర ప్రాంతీయ వేదికల్లోనూ కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

క్వాడ్ ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతకు భరోసా కల్పించడం, ఆసియాన్‌తో ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక సంబంధాలను విస్తరించడం ద్వారా భారత్ తన అంతర్జాతీయ భాగస్వామ్యానికి కొత్త దిశను నిర్దేశిస్తోంది. శాంతి, స్థిరత్వం, పరస్పర సహకారమే భవిష్యత్తు ప్రపంచానికి మార్గమని మోదీ తన ప్రసంగాల ద్వారా స్పష్టం చేశారు.

వాయు కాలుష్యంలో 40 శాతం బాధ్యత నాదే

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి రవాణా రంగం కూడా ప్రధాన కారణమని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారు. దేశంలో వాయు కాలుష్యంలో 40 శాతానికి తాను బాధ్యత వహిస్తున్నానని వ్యాఖ్యానించారు. రహదారుల అభివృద్ధి, వాహనాల సంఖ్య పెరుగుదల, పెట్రోల్, డీజిల్ వినియోగం వంటి అంశాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. రవాణా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు విధాన నిర్ణేతగా తనకూ బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన 14వ సీఐఐ బయోఎనర్జీ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణ

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నప్పటికీ పర్యావరణంపై పడుతున్న ప్రభావాన్ని విస్మరించకూడదని గడ్కరీ అభిప్రాయపడ్డారు. మెరుగైన రహదారులు అందుబాటులోకి రావడంతో వాహనాల కొనుగోళ్లు, వినియోగం పెరుగుతున్నాయని, ఫలితంగా ఇంధన వినియోగం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు కూడా అధికమవుతున్నాయని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు కాలుష్య నియంత్రణకు సమాంతరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.22 లక్షల కోట్లకు ఆటోమొబైల్ రంగం

తాను మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టిన సమయంలో దేశ ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ.14 లక్షల కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం అది రూ.22 లక్షల కోట్లకు చేరిందని గడ్కరీ తెలిపారు. ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో ఏడో స్థానంలో ఉన్న భారత్ మూడో స్థానానికి ఎదిగిందని పేర్కొన్నారు. ఈ వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నప్పటికీ సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం వల్ల పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు.

ప్రత్యామ్నాయ ఇంధనాలే పరిష్కారం

పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వ్యవస్థలను ప్రోత్సహించాలని గడ్కరీ



సూచించారు. ఇథనాల్, మిథనాల్, బయోడీజిల్, హైడ్రోజన్, విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మార్పుల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు విదేశీ ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణతోపాటు దేశ ఇంధన భద్రతకు ప్రత్యామ్నాయ ఇంధనాలు కీలకంగా మారతాయని పేర్కొన్నారు.

వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ

వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, సేంద్రియ వ్యర్థాలను ఇంధన ఉత్పత్తికి ఉపయోగించుకోవాలని గడ్కరీ సూచించారు. వీటి ద్వారా బయోఎనర్జీ, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తిని మరింత విస్తరించవచ్చన్నారు. ముఖ్యంగా పంట కోత అనంతరం మిగిలే వ్యవసాయ అవశేషాలను తగలబెట్టకుండా ఇంధన తయారీకి వినియోగిస్తే ద్వంద్వ ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

రైతులకు అదనపు ఆదాయం.. కాలుష్యానికి అడ్డుకట్ట

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల గాలిలోకి చేరే పొగ, హానికరమైన కాలుష్య కారకాలను తగ్గించేందుకు బయోఎనర్జీ ఉత్పత్తి ఉపయోగపడుతుందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ అవశేషాలను ఇంధన తయారీ సంస్థలకు అందించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ పరిశ్రమలకు అవకాశాలు పెరగడంతో ఉపాధి కల్పనకు కూడా దోహదపడుతుందని వివరించారు. మొత్తంగా రహదారుల అభివృద్ధి, ఆటోమొబైల్ రంగం విస్తరణతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గడ్కరీ తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. సంప్రదాయ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు రవాణా రంగం మళ్లితేనే కాలుష్య నియంత్రణ, ఇంధన స్వావలంబన లక్ష్యాలను సాధించగలమన్నది ఆయన ప్రసంగంలోని ప్రధాన సందేశం.

మోదీ ప్రభుత్వ విధానాలే ద్రవ్యోల్బణానికి కారణం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, ప్రజావ్యతిరేక విధానాల కారణంగానే దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ కార్యక్రమాల్లోనే నిమగ్నమై ఉన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత ఏడాది కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. నెయ్యి, వంట నూనెల ధరలు 75 శాతం, కూరగాయల ధరలు 73 శాతం, బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాల ధరలు 71 శాతం మేర పెరిగాయని ఆయన వెల్లడించారు. పాలు, పాల ఉత్పత్తుల ధరలు 65 శాతం, పప్పుధాన్యాల ధరలు 62 శాతం పెరిగినట్లు తెలిపారు. కొన్ని నివేదికల ప్రకారం ప్రతి పది కుటుంబాల్లో ఆరు కుటుంబాలు గృహ అవసరాల కోసం గత ఏడాదితో పోలిస్తే 20 శాతం అధికంగా ఖర్చు చేస్తున్నాయని వివరించారు. పెరుగుతున్న ధరల ప్రభావంతో 74 శాతం మంది ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకుంటుండగా, 50 శాతం మంది కనీస అవసరాలకు సంబంధించిన వస్తువుల కొనుగోళ్లను కూడా తగ్గించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పరిణామాలు సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడిని పెంచుతున్నాయని ఆరోపించారు. ధరల పెరుగుదల ప్రభావం కేవలం వినియోగదారులకే పరిమితం కాలేదని, వ్యాపార రంగంపైనా పడుతోందని జైరాం రమేశ్ అన్నారు. అమెరికా సుంకాలు, ముడి పదార్థాల ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఒక్క నోయిడాలోనే ఏడాది వ్యవధిలో 200 వస్త్ర కర్మాగారాలు మూతపడ్డాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల ఇళ్లలో ఆహార వినియోగం తగ్గుతోందని, పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ గత వారం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. దేశంలో కొనసాగుతున్న పరిస్థితిని 'అమృత్ కాల్'గా కాకుండా 'మెహంగాయీ కా భూచాల్' (ద్రవ్యోల్బణ భూకంపం)గా అభివర్ణించింది. పెరుగుతున్న ఖర్చులతో మధ్యతరగతి, పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొంటూ, ధరల నియంత్రణకు కేంద్రం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ధరల పెరుగుదలతో కుటుంబాల పొదుపు తగ్గిపోతోందని, అప్పుల భారం పెరుగుతోందని జైరాం రమేశ్ గతంలోనూ ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యతరగతి, పేద కుటుంబాలపై ద్రవ్యోల్బణం చూపుతున్న ప్రభావాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సామాన్యుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడు చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు, గృహ ఖర్చులు, పరిశ్రమల పరిస్థితిపై కాంగ్రెస్ చేస్తున్న ఈ విమర్శల నేపథ్యంలో ద్రవ్యోల్బణ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సమగ్రమైన రీతిలో అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (సియాల్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సహాయ కేంద్రాన్ని (ఫెసిలిటేషన్ సెంటర్) ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేరళలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలలో దర్శనం ముగిసిన వెంటనే వెనుదిరగకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ఒక ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య సుమారు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శబరిమల దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుతం కొనసాగుతున్న మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వృశ్చిక మాసం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని, పంబ, సన్నిధానంలలో స్వయంగా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు. మరోవైపు, కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇక్కడ శబరిమలకు నేరుగా వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సు సర్వీసులను కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. దీంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రీపెయిడ్ ట్యాక్సీ బుకింగ్, శాకాహార భోజన శాల, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలియజేసే ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వ్యవస్థను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులకు ఈ కేంద్రం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది.

విద్వేషం నుంచి విముక్తి కల్పించి ప్రేమను పంచడమే తన విధి



తల్లిదండ్రులైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న అనుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రేమను వ్యక్తపరచడం, అనుభవించడం అనే అంశంపై ఆయన ఒక రాజకీయ ప్రకటనను విడుదల చేస్తూ, దానికి సంబంధించి ఒక ఆలయ శిల్పం ఫొటోను జతచేశారు. సోనియా గాంధీ జీవిత అనుభవాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోమవారం రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే ప్రతిసారీ తన తండ్రి రాజీవ్ గాంధీ ఒళ్లో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని రాహుల్ పేర్కొన్నారు. "ప్రతి రోజూ భోజన సమయంలో నాన్న ఉండేవారు, నాన్న ఒళ్లో అమ్మ కూర్చునేది" అని రాహుల్ అనడంతో, వేదికపై ఉన్న సోనియా గాంధీ కాస్త ఇబ్బందిగా నవ్వారు. సాధారణంగా ఇతర కుటుంబాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించవని ఆ తర్వాత తనకు అర్థమైందని, చిన్నతనంలో ఇది సాధారణ విషయమే అనుకుని ఒక స్నేహితుడిని వారి తల్లిదండ్రుల గురించి కూడా అలాగే ప్రశ్నించానని రాహుల్ వివరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు, చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన రాహుల్ గాంధీ, మంగళవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పవిత్ర నందిపై శివపార్వతులు కలిసి ఆసీనులైనట్లు ఉన్న ఒక పురాతన ఆలయ శిల్పం చిత్రాన్ని ఆ పోస్ట్‌కు జతచేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం గూడుకట్టుకున్నాయి. అవి వారిని ప్రేమను అనుభూతి చెందకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయి. ఒక నిజమైన హిందువుగా వారిని ఈ వలయం నుంచి విముక్తులను చేయడం నా బాధ్యత. తద్వారా వారు కూడా తమ జీవితాల్లో అద్భుతమైన ప్రేమ, అనుబంధాల సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తారు... సత్యం శివం సుందరం" అని పేర్కొన్నారు.

భారత్ లో భారీ పెట్టుబడులకు అమెజాన్ సై..

భారత్‌లో పర్యావరణహిత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను విస్తరించేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఈ-కామర్స్, క్లౌడ్ సేవల దిగ్గజం అమెజాన్ భారీ ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి దేశంలో అదనంగా మరో 7 బిలియన్ డాలర్లను (సుమారు రూ.58 వేల కోట్లకు పైగా) గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే భారత్‌లో పునరుత్పాదక ఇంధన ఒప్పందాల కోసం 4 బిలియన్ డాలర్లను కేటాయించిన సంస్థ, తాజా నిర్ణయంతో తన విస్తరణను మరింత వేగవంతం చేయనుంది. తద్వారా దేశంలో కర్బన రహిత విద్యుత్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న కార్పొరేట్ సంస్థలలో ఒకటిగా అమెజాన్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పటికే కేటాయించిన 4 బిలియన్ డాలర్ల నిధుల్లో భాగంగా, మొత్తం 934 మెగావాట్ల (వీఐ) సంయుక్త సామర్థ్యంతో కూడిన నాలుగు సరికొత్త విండ్, సోలార్ ప్రాజెక్టులను అమెజాన్ ప్రకటించింది. వీటిలో కర్ణాటకలో 234 మెగావాట్ల భారీ విండ్ ప్రాజెక్ట్‌తో పాటు మరో 200 మెగావాట్ల హైబ్రిడ్ విండ్-సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయి. ఇందులో 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ ఆసియాలోనే అమెజాన్ చేపట్టిన అత్యంత భారీ పవన విద్యుత్ ఒప్పందం కావడం విశేషం. వీటితో పాటు మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు.

ఈ నాలుగు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భారత్‌లో అమెజాన్ కాంట్రాక్ట్ చేసుకున్న పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2 గిగావాట్లకు (+జి) పైగా చేరుకుంటుంది. ఈ విద్యుత్ దాదాపు 35 లక్షలకు పైగా భారతీయ గృహాల వార్షిక విద్యుత్ అవసరాలను తీర్చడానికి సమానమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమెజాన్‌కు సంబంధించి 14 భారీ విండ్, సోలార్ ప్రాజెక్టులతో పాటు 43 ఆన్-సైట్ సోలార్ యూనిట్లు పనిచేస్తున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే అమెజాన్ ఆధ్వర్యంలో 40 గిగావాట్లకు పైగా సామర్థ్యంతో సుమారు 700 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. ఈ అదనపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అమెజాన్ ప్రపంచవ్యాప్త పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని సంస్థ తెలిపింది. 2019 స్థాయితో పోలిస్తే, 2030 నాటికి తమ కార్యకలాపాలకు వినియోగించే విద్యుత్ ద్వారా వెలువడే కర్బన ఉద్గారాల తీవ్రతను 65 శాతం మేర తగ్గించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 'ది క్లైమేట్ ప్లెడ్జ్' ఒప్పందంలో భాగంగా 2040 నాటికి తమ అన్ని వ్యాపార కార్యకలాపాల్లో 'నెట్ జీరో' కర్బన ఉద్గారాల స్థాయికి చేరుకోవాలని అమెజాన్ భావిస్తోంది. అమెజాన్ తీసుకున్న ఈ భారీ నిర్ణయాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్వాగతించారు. భారత హరిత ఇంధన రంగంపై అంతర్జాతీయ సంస్థలకు పెరుగుతున్న విశ్వసనీయతకు ఈ పెట్టుబడులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల రాకతో దేశీయ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ వేగవంతం కావడంతో పాటు, నూతన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇంధన భద్రత పెరుగుతుంద

తుపాన్ల దెబ్బ నుంచి ఏపీని ఆదుకోండి



-మొదటిపేజీ తరువాయి

కోట్లకు మించిందని కేంద్ర మంత్రికి వివరించారు.

విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం

తుపాన్ల ప్రభావంతో విద్యుత్ సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని చంద్రబాబు తెలిపారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులు దెబ్బతినడంతో పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి వచ్చిందని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గించేందుకు, దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర సహకారం అవసరమని కోరారు.

కేంద్ర బృందాలు పరిశీలించాయి

తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించి వివరాలు సేకరించాయని చంద్రబాబు తెలిపారు. ఆ బృందాల పరిశీలన అనంతరం వీలైనంత త్వరగా ఆర్థిక సాయం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు అందితే బాధితులకు సహాయం అందించడంతో పాటు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు.

రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు

రాష్ట్రంలోని ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకూ కేంద్రం సహకరించాలని సీఎం కోరారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పండ్ల తోటలు, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం కల్పించడం ద్వారా రైతులకు ఆదాయ అవకాశాలు పెంచే ప్రణాళికలను వివరించారు.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు ప్రోత్సాహం

విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చేందుకు అవసరమైన మౌలిక వసతులు, కేంద్ర సహకారం కీలకమని తెలిపారు.

గ్రామీణ మౌలిక వసతులకు నిధులు

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, సాగునీటి సదుపాయాల మెరుగుదల, డ్రిప్ ఇరిగేషన్ విస్తరణకు నిధులు కేటాయించాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు మద్దతు కల్పించేందుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అవసరమని వివరించారు.

మూడు ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలపై వివరణ

విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రాంతాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను చంద్రబాబు వివరించారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రస్తావించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్రం నుంచి ఆర్థిక, విధానపరమైన సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుపాను నష్టాల నుంచి రాష్ట్రాన్ని కోలుకునేలా చేయడంతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం పొందడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.

అక్వాన్ తుపాను బీభత్సం..



-మొదటిపేజీ తరువాయి

సమయంలో గంటకు 130 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి.

కోస్తాకు అత్యంత భారీ వర్ష సూచన

తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తా జిల్లాల్లో పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. బుధవారం సాయంత్రం నుంచి తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే పరిస్థితులు ఉండవచ్చని, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని హెచ్చరించింది.

మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు.

ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు

తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. విలువైన పత్రాలను వాటర్‌ప్రూఫ్ కవర్లలో భద్రపరచుకోవాలని, కనీసం వారం రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, తాగునీటిని సిద్ధం చేసుకోవాలని తెలిపింది. తుపాను సమయంలో అవసరాన్ని బట్టి విద్యుత్ మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేయాలని, తలుపులు, కిటికీలను గట్టిగా మూసి ఉంచాలని సూచించింది.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరింది. చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణలేని సమాచారాన్ని నమ్మవద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని సూచించింది.

అత్యవసర సహాయం కోసం: మనమిత్ర -- 95523 00009, అత్యవసర నంబర్లు -- 112, 1070, 18004250101.

విద్యుత్ శాఖ అప్రమత్తం

అక్వాన్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు రాష్ట్ర విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. గతంలో అర్నబ్, మురసు తుపాన్ల సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మరమ్మతు బృందాలు సిద్ధంగా ఉండాలి

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర మరమ్మతుల కోసం వాహనాలు, పరికరాలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. తుపాను తీవ్రతను బట్టి సహాయక చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సిద్ధమవుతున్నారు.

ఇంజినీరింగ్ కనీస ఫీజు రూ.47 వేలకు పెంపు

రూ.40 వేల నుంచి రూ.47 వేలకు సవరణ..

మంత్రి నారా లోకేశ్‌కు అపెక్మా కృతజ్ఞతలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల కనీస వార్షిక ఫీజును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు రూ.40 వేలుగా ఉన్న కనీస ఫీజును రూ.47 వేలకు సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ తాత్కాలిక ఫీజు పెంపు నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం (అపెక్మా) స్వాగతించింది. కళాశాలల ఆర్థిక పరిస్థితులు, నిర్వహణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఫీజును సవరించినందుకు కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

కొత్త ఫీజుల ఖరారుకు కసరత్తు

2026--29 కొత్త బ్లాక్ పీరియడ్‌కు సంబంధించి ఇంజినీరింగ్ కళాశాలల పూర్తి ఫీజుల వివరాలను రానున్న రెండు నెలల్లో ప్రభుత్వం ఖరారు చేయనుందని అపెక్మా వెల్లడించింది. ప్రస్తుతం ప్రకటించిన పెంపు తాత్కాలికమని, తదుపరి ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం త్వరలో స్పష్టత ఇవ్వనుందని పేర్కొంది.

రూ.5 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదల

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపైనా అపెక్మా వివరాలు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.5 వేల కోట్ల మేర బకాయిలను విడుదల చేసిందని తెలిపింది. ప్రస్తుతం ప్రతినెలా రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు నిధులు విడుదలవుతున్నాయని పేర్కొంది. ఈ మొత్తాన్ని నెలకు రూ.400 కోట్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించింది.

మిగిలిన రూ.800 కోట్లు త్వరలో విడుదల

2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.1,800 కోట్లకు ప్రాసీడింగ్స్ జారీ కాగా, ఇప్పటికే రూ.1,000 కోట్లు విడుదలయ్యాయని సంఘం తెలిపింది. మిగిలిన రూ.800 కోట్లను రానున్న రెండు మూడు నెలల్లో విడుదల చేసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కనీసం 50 శాతం రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించింది.

విద్యార్థుల ఖాతాల్లోనే ఎంటీఎఫ్?

మెయింటెనెన్స్ ట్యూషన్ ఫీజు (ఎంటీఎఫ్) నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని అపెక్మా వివరించింది. ఈ విధానంపై స్పష్టత వస్తే విద్యార్థులకు నిధుల పంపిణీ ప్రక్రియలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

సర్టిఫికెట్లు నిలిపివేయొద్దు

మరోవైపు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు అపెక్మా పలు సూచనలు చేసింది. కోర్సు పూర్తి చేసిన చివరి సంవత్సరం విద్యార్థుల సర్టిఫికెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయవద్దని స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రొసీడింగ్స్ జారీ అయినప్పటికీ సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు నేరుగా సంఘాన్ని సంప్రదించవచ్చని తెలిపింది.

హాస్టల్, రవాణా ఫీజుల పేరుతో అడ్మిషన్లు నిరాకరించొద్దు

హాస్టల్ లేదా రవాణా ఫీజుల పేరుతో విద్యార్థులకు ప్రవేశాలు నిరాకరించవద్దని కళాశాలలకు సూచించింది. ప్రభుత్వం నిర్దేశించిన కనీస ఫీజుతోనే అడ్మిషన్లు కల్పించాలని స్పష్టం చేసింది. అడ్మిషన్లలో జాప్యం లేదా హాజరు నమోదు సమస్యల కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత కోల్పోయిన విద్యార్థుల వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేసి అర్హతను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించింది.

కోనసీమ బ్లోఅవుట్‌పై సీఎం సమీక్ష

-మొదటిపేజీ తరువాయి

కిలోమీటరు పరిధిలో ఉన్న నివాస ప్రాంతాల ప్రజలను ఇప్పటికే ఖాళీ చేయించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటివరకు మంటలు చెలరేగలేదని, గ్యాస్ బావి ముఖద్వారం పటిష్ఠంగానే ఉందని ఓఎన్‌జీసీ అధికారులు వెల్లడించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ లీకేజీని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో సమీక్ష

ఇటీవలి కాలంలో ఇలాంటి బ్లోఅవుట్ ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ఓఎన్‌జీసీ ఛైర్మన్‌తో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి భద్రతా ప్రమాణాలను సమీక్షించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా

కోనసీమ జిల్లాలో గ్యాస్ లీకేజీ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఘటన తీవ్రత, పరిసర గ్రామాల ప్రజల భద్రత, సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో పెద్ద శబ్దంతో ఒక్కసారిగా గ్యాస్ వెలువడినట్లు కలెక్టర్ వివరించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. వరుసగా చోటుచేసుకుంటున్న బ్లోఅవుట్ ఘటనల నేపథ్యంలో సంబంధిత ప్రాంతాల్లో భద్రతా తనిఖీలు, సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

గత రెండు తుపాన్లతో పోలిస్తే అక్వాన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చు

-మొదటిపేజీ తరువాయి



ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం, అక్వాన్ తుపాను ఈ నెల 20వ తేదీన నెల్లూరు - తుని మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో తీరం వెంబడి గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత నెల రోజుల వ్యవధిలో అర్నబ్, మురసు తుపాన్లు రాష్ట్రాన్ని తాకాయని, అయితే వాటితో పోలిస్తే అక్వాన్ తీవ్రత చాలా ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు తుపాన్ల సమయంలో ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠమైన చర్యల వల్ల ప్రాణనష్టం జరగలేదని, ఇదే స్ఫూర్తితో అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వరి పంట చేతికి వచ్చే కీలక సమయంలో ఈ తుపాను రావడం దురదృష్టకరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రైతుల పంట నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు పంచాయతీరాజ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సహకరించాలని, కోతకు వచ్చిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులకు అండగా ఉండాలని సూచించారు.

గత తుపాన్ల ధాటికి రాష్ట్రంలో దాదాపు 520 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం అక్వాన్ వల్ల రోడ్లపై చెట్లు విరిగిపడినా లేదా ఇతర నష్టాలు జరిగినా యుద్ధప్రాతిపదికన రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టేలా ఆ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.

మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, సామాన్య ప్రజలు కూడా బీచ్‌ల వైపు వెళ్లకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇటీవల తుపాను గాలుల్లో చిక్కుకుని తమిళనాడు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటనను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రజల ప్రాణరక్షణకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులంతా గ్రామాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

స్వర్ణ గ్రామ, వార్డు కో-ఆర్డినేటర్లకు 23 శాతం జీతాల పెంపు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల్లో పనిచేస్తున్న కో-ఆర్డినేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ డిమాండ్‌పై సానుకూలంగా స్పందిస్తూ వారి జీతాలను 23 శాతం పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో జిల్లా, అసిస్టెంట్ జిల్లా, టౌన్ కో-ఆర్డినేటర్లకు నెలవారీ వేతనాలు పెరగనున్నాయి.

ఎవరికి ఎంత పెరిగిందంటే?

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కో-ఆర్డినేటర్ల వేతనాలు ఇలా పెరగనున్నాయి.

2020 నుంచి వేతన సవరణ కోసం ఎదురుచూపులు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల్లో పనిచేస్తున్న ఈ కో-ఆర్డినేటర్లు 2020లో కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో చేరారు. అప్పటి నుంచి తమ వేతనాలను సవరించాలని కోరుతున్నప్పటికీ ఇప్పటివరకు పెంపు జరగలేదు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఉద్యోగులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడినట్లయింది.

ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర

గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా పర్యవేక్షించడం కో-ఆర్డినేటర్ల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. ప్రజా సేవల అమలు తీరును పరిశీలించడం, సచివాలయాల పనితీరును సమన్వయం చేయడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట

చాలాకాలంగా వేతన పెంపు కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు తాజా నిర్ణయం ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పించనుంది. జిల్లా కో-ఆర్డినేటర్లకు నెలకు రూ.8,280, అసిస్టెంట్ జిల్లా, టౌన్ కో-ఆర్డినేటర్లకు రూ.6,210 చొప్పున అదనపు వేతనం లభించనుంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలుతో పెరిగిన వేతనాలు అందనున్నాయి

గోపాష్టమి సందర్భంగా మచిలీపట్నంలోని పలు ఆలయాల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

గోమాత విశిష్టత, గోసంరక్షణ ఆవశ్యకతపై ధార్మిక చైతన్య కార్యక్రమాలు

మచిలీపట్నం, నవంబర్ 17,(మీ వార్త ప్రతినిధి) గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయం, గొడుగుపేట రామలింగేశ్వరస్వామి ఆలయం, అక్కయ్యపాలెంలోని ఆలయం, వినాయకుని గుడి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గోపాష్టమి పర్వదినాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు.ఈ కార్యక్రమాలను విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, లోకకల్యాణం, సమాజ శ్రేయస్సు, సర్వేజనాః సుఖినోభవంతు అనే భారతీయ ధార్మిక భావనతో ప్రార్థనలు చేశారు.సనాతన ధర్మంలో గోమాతకు విశిష్ట స్థానం,భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ సంప్రదాయాల్లో గోవుకు అత్యంత పవిత్రమైన, గౌరవప్రదమైన స్థానం ఉంది. గోమాతను కేవలం ఒక పశువుగా కాకుండా వ్యవసాయానికి, గ్రామీణ ఆర్థిక



వ్యవస్థకు, పర్యావరణ సమతుల్యతకు, మానవ జీవన విధానానికి తోడ్పడే జీవిగా మన సంప్రదాయం గుర్తించింది. గోసేవ, గోపోషణ, గోసంరక్షణ భారతీయ జీవన సంస్కృతిలో అంతర్భాగాలుగా కొనసాగుతున్నాయి.గోపాష్టమి శ్రీకృష్ణుడి గోపాలక జీవితాన్ని, గోవులతో ఆయనకున్న అనుబంధాన్ని స్మరించుకునే పవిత్రమైన పర్వదినం. శ్రీకృష్ణుడు గోవులను సంరక్షిస్తూ, వాటితో మమేకమై జీవించిన గోపాలుడిగా భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో విశిష్ట స్థానం పొందారు. అందువల్ల ఈ పర్వదినం గోమాత పట్ల గౌరవాన్ని, జీవకారుణ్యాన్ని, ప్రకృతితో మనిషికున్న అనుబంధాన్ని గుర్తుచేస్తుంది.ధార్మిక చైతన్యమే సమాజ నిర్మాణానికిపునాది,పండుగలు కేవలం ఆచారాలకు, ఉత్సవాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి వెనుక ఉన్న ధార్మిక, సాంస్కృతిక, సామాజిక సందేశాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ భావిస్తోంది. దేవాలయాలను కేంద్రంగా చేసుకుని సమాజంలో ధార్మిక చైతన్యం, సామాజిక సమరసత, సేవాభావం, ఐక్యతను పెంపొందించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన లక్ష్యం.గోమాత పట్ల భక్తిని వ్యక్తం చేయడంతో పాటు గోవుల పట్ల కరుణ, బాధ్యత, సంరక్షణను మన దైనందిన జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉంది. సంప్రదాయాలను పాటించడం మాత్రమే కాకుండా వాటి అంతరార్థాన్ని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టినప్పుడే సనాతన ధర్మ విలువలు సమాజంలో మరింత బలపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.హిందూ సమాజంలో ధార్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ, దేవభక్తితో పాటు దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతలను ప్రోత్సహించే కార్యక్రమాలను భవిష్యత్తులోనూ విస్తృతంగా నిర్వహిస్తామని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా ప్రతినిధులు తెలిపారు.విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

బాల్య వివాహాలు వద్దు - బాలల భవిష్యత్తు కు ఉండకూడదు హద్దు.

రౌతులపూడి నవంబర్ 17:(మీ వార్త న్యూస్ ప్రతినిధి బాల్య వివాహాలు వద్దు బాలికల భవిష్యత్తుకు ఉండకూడదు హద్దు అనే ప్రగాఢ సంకల్పంతో బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు, శంఖవరం ప్రాజెక్ట్ సిడిపిఓ పి. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో, పారుపాక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శివగిరి అధ్యక్షతన పారుపాక హైస్కూల్‌లో విద్యార్థి,విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు మరియు బాలల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలు, విద్యకు కలిగే ఆటంకాలు, శారీరక మరియు మానసిక ఆరోగ్య సమస్యలు, సామాజిక పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహ నిషేధ చట్టం--2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. అదేవిధంగా బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, బాలలపై జరిగే హింస, వేధింపులు, బాల కార్మికత్వం, బాలల అక్రమ రవాణా వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఉన్నత విద్యను అభ్యసించి స్వతంత్రంగా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాలల రక్షణ కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.బాల్య వివాహాల నిర్మూలన కు ప్రభుత్వంతోపాటు తల్లిదండ్రులు మరియు సమాజంలోని



ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సూపర్వైజర్ బి రజిని, ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. విజయ , ఉపాధ్యాయ సిబ్బంది బి వీఎస్ కుమార్, సిహెచ్ అమ్మాజీ, డి.రమదేవి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు..

కందికుప్ప జడ్పీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు!

బాలల రక్షణకు పోక్సో చట్టం కవచం!

స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దాసరి సత్యనారాయణ!

ముమ్మిడివరం నవంబర్ 17 కందికుప్ప జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు మరియు పోక్సో చట్టంపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముమ్మిడివరం స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దాసరి సత్యనారాయణ మాట్లాడుతూ, బాలబాలికల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. భారతదేశంలో 18 సంవత్సరాల లోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు మరియు అసభ్యకర ప్రవర్తనలను అరికట్టేందుకు పోక్సో చట్టం (2012) తీసుకువచ్చారని, ఈ చట్టం కింద నమోదయ్యే కేసులలో నేర తీవ్రతను బట్టి 3 సంవత్సరాల జైలు శిక్ష నుండి మరణశిక్ష వరకు అత్యంత కఠినమైన శిక్షలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్) మధ్య ఉన్న తేడాలను స్పష్టంగా



గుర్తించాలని, ఎవరైనా అనుమతి లేకుండా శరీరంలోని సున్నితమైన భాగాలను తాకితే భయపడకుండా, ఆ విషయాన్ని దాచిపెట్టకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. అలాగే అత్యవసర సమయాల్లో రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వేధింపులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో న్యాయవాదులు గుత్తుల శ్రీనివాసరావు, ఎమ్. ఆలి హసన్, కన్నీడి వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు సుమారు 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.

ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిశోర్, ఐపీఎస్ వారు యొక్క ఆదేశాల మేరకు, ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోటదిబ్బ నందు జూూ+రాజు డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్ మరియు ణు=దీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి కారణంగా వ్యక్తిగత జీవితం, కుటుంబం మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాల గురించి జూూ+రాజు డిపార్ట్‌మెంట్ ద్వారా వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని విద్యార్థులకు సూచించారు.
అదేవిధంగా మహిళలు మరియు చిన్నారుల భద్రత, మహిళలపై జరిగే నేరాలు, చిన్నారుల రక్షణ,ూాజూూా చట్టంలోని ముఖ్యమైన అంశాలు మరియు బాలలపై లైంగిక నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి





ఉమెన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వివరించారు. విద్యార్థులు తమ భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా వేధింపులు లేదా అసాంఘిక ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.
ణు=దీ విభాగం ద్వారా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, రహదారి భద్రతలో ప్రతి ఒక్కరి బాధ్యత గురించి వివరించారు.
ఈ మూడు విభాగాలు సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, మహిళలు మరియు బాలల భద్రత, రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు జూూ+రాజు డిపార్ట్‌మెంట్ =ా× శ్రీ బి. ఉదయభాస్కర్ వన్‌టౌన్ ఎస్ఐ ఎ. వంశీ అలెగ్జాండర్ ణు=దీ ఎస్ఐ కె. రాంబాబు జూూ+రాజు డిపార్ట్‌మెంట్, ణు=దీ సిబ్బంది మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. యువతను మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయడంతో పాటు, మహిళలు మరియు బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

విజనరీ 2026 నేషనల్ అవార్డు గ్రహీతకు శ్రీ నార్ని అమర చందు వశిష్ట గురువుకి హృదయపూర్వక అభినందనలు



అమరావతి నవంబర్ 17(మీ వార్త ప్రతినిధి) ఆధ్యాత్మిక మరియు సేవా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన విజనరీ 2026 నేషనల్ అవార్డు (డివిషనల్ ఉ సర్వీస్) అందుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సేవకులు, శ్రీశ్రీశ్రీ అన్నావర్జుల నరసింహారావు పంతులుగారి శిష్యులు శ్రీ నార్ని అమర చందు వశిష్ట గురువుగారికి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాము. హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్ ఆడిటోరియంలో పాన్ ఇండియా కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో గురువుగారు ఈ జాతీయ పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందదాయకం. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి శ్రీ వేణుగోపాలాచారి , ప్రముఖ సినీ నటులు శ్రీ సుమన్ , తెలంగాణ మాజీ మంత్రి శ్రీ మధుసూదనాచారి తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఆధ్యాత్మిక చింతన, ధార్మిక సేవ, సమాజ హితం పట్ల అంకితభావంతో గురువు చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం మనందరికీ గర్వకారణం. ఈ అవార్డు వారి సేవా ప్రయాణానికి మరింత స్ఫూర్తినిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడాలని ఆకాంక్షిస్తున్నాము.వారి ఆధ్యాత్మిక సేవలు మరింత విస్తరించి, సమాజానికి, ధర్మానికి మరిన్ని సేవలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము.

కోడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పెడన తాసిల్దార్, మండల వ్యవసాయ అధికారి



పెడన నవంబర్ 17(మీ వార్త ప్రతినిధి) ఈ రోజు పెడన తాసిల్దార్ శ్రీమతి వహీదా రెహమాన్ మరియు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సజ్జా. జెన్నీ కోడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో రైతులందరిని అప్రమత్తంగా ఉండమని కోసిన ధాన్యాన్ని మిల్స్ కి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంపించాలని సూచించారు. అన్ని రైతు సేవ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, వరి కోసిన రైతులు ధాన్యం మిల్స్ కి లేదా మార్కెట్ ధర బయట ఎక్కువగా ఉన్నందున రైతులు బయట కు పంపిచ్చుటకు మక్కువ చూపిస్తున్నందున , ధాన్యం సురక్షితమైన ప్రాంతాలకు తరలించాల్సిందిగా తెలియజేశారు.

కందికుప్ప జడ్పీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు!

బాలల రక్షణకు పోక్సో చట్టం కవచం!

స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దాసరి సత్యనారాయణ!



ముమ్మిడివరం నవంబర్ 17 కందికుప్ప జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు మరియు పోక్సో చట్టంపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముమ్మిడివరం స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దాసరి సత్యనారాయణ మాట్లాడుతూ, బాలబాలికల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. భారతదేశంలో 18 సంవత్సరాల లోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు మరియు అసభ్యకర ప్రవర్తనలను అరికట్టేందుకు పోక్సో చట్టం (2012) తీసుకువచ్చారని, ఈ చట్టం కింద నమోదయ్యే కేసులలో నేర తీవ్రతను బట్టి 3 సంవత్సరాల జైలు శిక్ష నుండి మరణశిక్ష వరకు అత్యంత కఠినమైన శిక్షలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్) మధ్య ఉన్న తేడాలను స్పష్టంగా గుర్తించాలని, ఎవరైనా అనుమతి లేకుండా శరీరంలోని సున్నితమైన భాగాలను తాకితే భయపడకుండా, ఆ విషయాన్ని దాచిపెట్టకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. అలాగే అత్యవసర సమయాల్లో రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వేధింపులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో న్యాయవాదులు గుత్తుల శ్రీనివాసరావు, ఎమ్. ఆలి హసన్, కన్నీడి వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు సుమారు 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తాటిపాక-7 ఓఎన్‌జీసీ రిగ్ గ్యాస్ లీకేజీ పూర్తిగా అదుపులోకి....

ప్రజలకు ఊరట



పి గన్నవరం, నవంబర్ 17 (మీవార్త ప్రతినిధి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం నగరం గ్రామ సమీపంలోని తాటిపాక-7 ఓఎన్‌జీసీ రిగ్ వద్ద చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనను జిల్లా యంత్రాంగం, ఓఎన్‌జీసీ సాంకేతిక బృందం సమన్వయంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకల్లా పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.
గ్యాస్ లీకేజీ సమాచారం అందిన వెంటనే స్పందించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిర్వహించిన సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎటువంటి ప్రాణనష్టం, అగ్నిప్రమాదం జరగకుండా గ్యాస్ లీకేజీని అదుపులోకి తీసుకురావడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొంటూ సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించనున్నారు.

ఆపరేషన్ త్రిశూల్‌పై అవగాహన

జి.మాడుగుల ఎస్ఐ సాయిరాం పడాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం



జి.మాడుగుల (మీ వార్త ప్రతినిధి) ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా బాలలు, మహిళల భద్రత, రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు జి.మాడుగుల ఎస్ఐ సాయిరాం తెలిపారు. సంతబయలు సంతను ఆయన సందర్శించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలలపై నేరాల నివారణ, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రహదారి భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వంటి అంశాలను వివరించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను, ముఖ్యంగా గంజాయి వినియోగానికి దూరంగా ఉండాల్సిన అవసరాన్ని ఎస్ఐ సాయిరాం వివరించారు. సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు.

యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..

ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్, కార్యదర్శి బుర్రి కుమార్ రాజా

జి.మాడుగుల శాఖా గ్రంథాలయంలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు





జి.మాడుగుల(మీ వార్త ప్రతినిధి) నేటి ఆధునిక సమాజానికి అనుగుణంగా యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్, కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పిలుపునిచ్చారు. ?59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం జి.మాడుగుల నూతన శాఖా గ్రంథాలయ భవనాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశంపై దిశానిర్దేశం చేశారు.
?జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో జి.మాడుగుల ఎంపీయూపీ (ఎంపీపీ) పాఠశాల ఉపాధ్యాయుడు డి. కేశవర్ధన రావు, శ్రీ వెంకట రమా విద్యా విహార్ ప్రిన్సిపాల్ కె. మత్స్యరాజు, ఉపాధ్యాయులు జి. నాగేశ్వరరావు, ఎల్. రోజారాణి, పి. కవిత, ఎస్. నాగరాజు, గ్రంథాలయ పాఠకులు జె. హిమాలయ, టి. కృష్ణ, గ్రంథాలయ అధికారి వి. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
?

రౌతులపూడి పంచాయతీ ఏకగ్రీవం చేస్తే రెండు ఎకరాలు భూమి.



రౌతులపూడి నవంబర్ 17 :(మీ వార్త న్యూస్ ప్రతినిధి) రౌతులపూడి పంచాయతీకి సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఇస్తే పంచాయతీకి రెండు ఎకరాల భూమి రాసిస్తానని చింతకాయల వెంకట సుబ్బలక్ష్మి ప్రకటించారు. రౌతులపూడి పోటీ చేస్తున్న తనను ఏకగ్రీవంగా సర్పంచ్ ని చేస్తే రౌతులపూడి పంచాయతీకి రెండు ఎకరాలు భూమి రాసిస్తానని సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న చింతకాయల వెంకటసుబ్బలక్ష్మి భర్త వాసిరెడ్డి కృష్ణ(శోభన్ బాబు కృష్ణ) హామీ ఇచ్చారు. పంచాయతీ ఆ భూమిని గ్రామాభివృద్ధికి మరియు ఇతర కార్యక్రమాలకైనా తనష్టానుసారంగా వాడుకోవచ్చునని దానిపై మాకు ఏ విధమైనటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. అనంతరం గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపడతామని ముఖ్యంగా పారిశుద్ధ్యం లోపించిందని గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేందుకు కార్మికులను పెంచుతామని తెలియజేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మరొక వాటర్ ట్యాంకు గ్రామంలో నిర్మించి నీటి కొరతే లేకుండా తగు చర్యలు చేపడతామని, ప్రజలకు ఏ విధమైన కరెంటు కష్టాలు రాకుండా సమస్యలను విని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఏలూరు జిల్లాలో హోంగార్డ్ డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం..

ఏలూరు జిల్లాకు చెందిన నిరుద్యోగ యువకులకు హోంగార్డ్ డ్రైవర్ పోస్టుల భర్తీకి అవకాశం కల్పిస్తున్నారు.

అర్హ తలు:
1. అభ్యర్థి ఏలూరు జిల్లా స్థానిక నివాసి అయి ఉండాలి.
2. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
3. చెల్లుబాటు అయ్యే హెవీ మోటార్ వెహికల్ (ఎవీఎ) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
4. ఏలూరు జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకుని ఉండాలి.
5. గరిష్ట వయోపరిమితి 25 సంవత్సరాలు. 01-07-2025 నాటికి 25 సంవత్సరాలు పూర్తి అయి ఉండకూడదు.
6. మీరు ఎంప్లాయిమెంట్ కార్యాలయం ద్వారా ఎన్రోల్ చేయించుకున్న తర్వాత మీ డాక్యుమెంట్ను ఎంప్లాయిమెంట్ అధికారులు పరిశీలించి నేరుగా ఎస్పీ కార్యాలయానికి పంపుతారు తర్వాత అర్హతలు కలిగిన అభ్యర్థులకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి సమాచారం అందుతుంది

ఎంపిక విధానం: ఎంపిక పరీక్ష ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుంది.
అర్హత కలిగిన ఏలూరు జిల్లా యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించడమైనది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం





ప్రజా వినతులకు తక్షణ స్పందన
అధికారులకు ఆదేశాలు
ప్రజలకు భరోసా
గత రెండున్నరేళ్లలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. మంగళవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వినతులు స్వీకరించారు. సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత రెండున్నరేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చామని, రానున్న రోజుల్లోనూ మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు.

ఏలూరు డివిజన్ పరిధిలోని తపాలా కార్యాలయాలలో సేవలు తాత్కాలికంగా నిలిపివేత

ఏలూరు, నవంబర్, 17 : పోస్టల్ డైరెక్టరేట్, న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ూూ×) మరియు గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఛూ×) సేవలను ప్రస్తుతం వీఏఋఎఅంఫ్ట్ర వ్యవస్థ నుండి నూతన ×అంబత్ఘీఅఎవ మ్ఘీఋస్త్రవఎవఅ్ ూఖశ్రీబ్అశీఅ (×మీ) వ్యవస్థకు మార్చు చేయనున్న నేపథ్యంలో 24.11.2026 వరకు ఏలూరు డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాలలో ూూ× / ఛూ× సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడుతున్నాయని ఏలూరు డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ ూ. విజయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పిడి ప్రక్రియలో భాగంగా పై తేదీలలో కొత్త పాలసీల నమోదు, ప్రీమియం చెల్లింపులు మరియు ఇతర ఆర్థిక, ఆర్థికేతర సేవలు అందుబాటులో ఉండవన్నారు. నూతన ×మీ వ్యవస్థ ద్వారా ూూ× / ఛూ× సేవలు 25.11.2026 నుండి తిరిగి ప్రారంభించబడతాయన్నారు. మరిన్ని వివరాల కోసం సమీపంలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

వార్డ్ మెంబర్ గా అబ్బదాసరి మరియదాసు

లింగపాలెం,నవంబర్ 14 (మీ వార్త విలేఖరి):మండల పరిధిలోని మఠంగూడెం గ్రామ పంచాయతీ 9 వ వార్డు మెంబర్ గా తెలుగుదేశం, బిజెపి జనసేన పార్టీ అభ్యర్థి అబ్బదాసరి మరియ దాసు ధర్మాజిగూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులు రాయల ప్రసాద్ , మహేష్, ప్రేమ్ కుమార్, జోజి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చిన్న కొత్త లంక సర్పంచ్ అభ్యర్థిగా రవి వర్మ



ముమ్మిడివరం, నవంబర్ 17 (మీ వార్త ప్రతినిధి):మండల పరిధిలోని చిన్న కొత్తలంక గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా పచ్చమట్ల రవి వర్మ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కూటమి అభ్యర్థిగా రవివర్మను కొత్తలంక గ్రామ ప్రజలు నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకుని సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే సేవా భావజాలం కలిగిన రవి వర్మకు విజయం సునాయసమే అని పలువురు భిప్రాయపడుతున్నారు. గ్రామం నుండి ఎవరైనా కాకినాడ ఆసుపత్రికి వెళ్లిన ఎవరికి ఏ విధమైన సహాయం కావాలన్నా క్షణాల్లో సహాయం చేసే సేవా భావం కలిగిన రవివర్మ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగెడుతున్న సందర్భంగా రవి వర్మ అనేకమైన ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకుంటున్నాను అని కొత్తలంక పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. అభిమానులు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అభిమానులు తో కలిసి అట్టహాసంగా రవి వర్మ నామినేషన్ దాఖలు చేశారు

అనంతగిరిలో సర్పంచ్ ఎన్నికల కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అమిత్ బర్డర్.





అనంతగిరి,నవంబర్ 17 (మీ వార్త) అనంతగిరి పంచాయతీ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్పంచ్ గ్రామ పంచాయతీ ఎన్నికల కేంద్రాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్డర్,అరుకు సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు,అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే శంకర్ రావులతో కలిసి పరిశీలించి తనిఖీ చేశారు.ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్న నామినేషన్ ప్రక్రియకు సంబంధించి కేంద్రం వద్ద చేపట్టిన ఏర్పాట్లు,పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా,పారదర్శకంగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

చిన్న కొత్త లంక సర్పంచ్ అభ్యర్థిగా రవి వర్మ



ముమ్మిడివరం, నవంబర్ 17 (మీ వార్త ప్రతినిధి): మండల పరిధిలోని చిన్న కొత్తలంక గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా పచ్చమట్ల రవి వర్మ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కూటమి అభ్యర్థిగా రవివర్మను కొత్తలంక గ్రామ ప్రజలు నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకుని సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే సేవా భావజాలం కలిగిన రవి వర్మకు విజయం సునాయసమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామం నుండి ఎవరైనా కాకినాడ ఆసుపత్రికి వెళ్లిన ఎవరికి ఏ విధమైన సహాయం కావాలన్నా క్షణాల్లో సహాయం చేసే సేవా భావం కలిగిన రవివర్మ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగెడుతున్న సందర్భంగా రవి వర్మ అనేకమైన ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకుంటున్నాను అని కొత్తలంక పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. అభిమానులు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అభిమానులు తో కలిసి అట్టహాసంగా రవి వర్మ నామినేషన్ దాఖలు చేశారు

అనంతగిరిలో సర్పంచ్ ఎన్నికల కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అమిత్ బర్డర్.





అనంతగిరి,నవంబర్ 17 (మీ వార్త) అనంతగిరి పంచాయతీ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్పంచ్ గ్రామ పంచాయతీ ఎన్నికల కేంద్రాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్డర్,అరుకు సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు,అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే శంకర్ రావులతో కలిసి పరిశీలించి తనిఖీ చేశారు.ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్న నామినేషన్ ప్రక్రియకు సంబంధించి కేంద్రం వద్ద చేపట్టిన ఏర్పాట్లు,పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా,పారదర్శకంగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యం బాటిల్ పై ఎంఆర్పీ కంటే అదనంగా వసూలు

గ్రామ గ్రామాన్న వెలుస్తున్న బెల్ షాపులు

పట్టించుకోని ఎక్సైంజ్ శాఖ అధికారులు



కుక్కునూరు,నవంబర్ 17 (మి వార్తా ప్రతినిధి)
కుక్కునూరు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతమైన కుక్కునూరు మండలంలో అక్రమ మద్యం విక్రయాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నాయి. నిబంధనలకు తూట్లు పొడుస్తూ గ్రామగ్రామాన వెలిసిన బెల్ట్ షాపులతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తున్న వేళ ఈ అక్రమ దందా మరింత ఊపందుకుంది. ఆటోల్లో డోర్ డెలివరీ.. అడ్డగోలు దోపిడీ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, 36 గ్రామాల పరిధిలో అనధికారిక మద్యం దుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ప్రభుత్వ దుకాణాల నుంచే మద్యాన్ని కొనుగోలు చేస్తున్న కొందరు వ్యాపారులు, ఆటోల్లో మారుమూల గిరిజన గ్రామాలకు తరలించి మరీ డోర్ డెలివరీ చేస్తున్నారు. కిరాణా దుకాణాలు, పాన్ షాపుల మాటున ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ఇదే అదనుగా ఎంఆర్పీ కంటే క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.60 వరకు, ఫుల్ బాటిల్‌పై రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా వసూలు చేస్తూ సామాన్యుల రక్తాన్ని పీల్చుతున్నారు. ఎన్నికల ప్రచారం జోరందుకోవడంతో ధరలకు మరింత రెక్కలొచ్చాయి. రోడ్డున పడుతున్న కూలీల కుటుంబాలు రోజంతా కష్టపడి సంపాదించిన కూలీ డబ్బులు మద్యానికే కరిగిపోతుండటంతో పేద, గిరిజన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మరోవైపు గ్రామాల్లో మద్యం మత్తులో ఘర్షణలు, కుటుంబ కలహాలు పెరుగుతుండటంతో మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువత పెడదారి పట్టే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమ నిల్వలు పెంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిద్రమత్తులో ఎక్సైజ్ యంత్రాంగం బహిరంగంగానే ఆటోల్లో రవాణా, వీధుల్లో విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తనిఖీలు చేపట్టి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోందని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించాలని, బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర మాక్ అసెంబ్లీకి ఎన్నికైన విద్యార్థిని లిఖితకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందనలు





పి గన్నవరం, నవంబర్ 17 :(మీవార్త ప్రతినిధి నవీన్)
రాష్ట్ర మాక్ అసెంబ్లీకి ఎన్నికైన విద్యార్థిని కాంద్రేగుల లిఖితను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆయన క్యాంపు కార్యాలయం లో మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికకు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది ఆమె ప్రతిభ, నాయకత్వ లక్షణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ,

దేవా వరప్రసాద్, జడ్పీటీసీ గొల్లపల్లి అమూల్య





మామిడికుదురు , నవంబర్ 17 (మీవార్త విలేఖరి)
మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని తాడివారి మెరక రుద్రవరం సెల్ నంబర్-7 వద్ద మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవా వరప్రసాద్, జడ్పీటీసీ రాజోలు టీడీపీ ఇంచార్జి గొల్లపల్లి అమూల్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సుమారు 100 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, నగరం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధిత ప్రజలతో వారు నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడుతున్నామని, అదేవిధంగా సాంకేతిక నిపుణుల బృందంతోనూ సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

నాగేశ్వరరావుపేటలో కూటమి ఎన్నికల ప్రచార హోరు....

బంటుమిల్లి నవంబర్ 17(మీ వార్త ప్రతినిధి)
సర్పంచ్ అభ్యర్థి కాగిత కుమార్‌తో కదిలిన కూటమి శ్రేణులు.. నాగేశ్వరరావుపేట సర్పంచ్ ఎన్నికల బరిలో ఉన్న కూటమి అభ్యర్థి కాగిత కుమార్ ప్రచారాన్ని ఉధృతం చేశారు. గ్రామంలోని ప్రతి గడపను తడుతూ ఓటర్లను కలుసుకున్నారు. తనకు అవకాశం కల్పించి, గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామపంచాయతీ పరిధిలోని మూడు సెగ్మెంట్లకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి ఆయనకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అభ్యర్థి వెంట నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కదలడంతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది



బాలబడుల ఉపాధ్యాయ బృందానికి నైపుణ్య శిక్షణ కార్యక్రమం





జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) స్థానిక రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బాలబడల ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్య నిపుణులు, డాక్టర్ సి ఏ ప్రసాద్. స్థానిక రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ (ఆర్ డి ఎస్ ఎస్) కార్యాలయ ప్రాంగణంలో బాలబడుల ఉపాధ్యాయ బృందానికి రెండురోజులపాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యా నిపుణులు సులభతర విద్యా బోధన రూపకర్త డాక్టర్ సి ఏ. ప్రసాద్ పాల్గొని. జి. మాడుగుల, చింతపల్లి, మరియు కొయ్యూరు మండలాల లోతట్టు ప్రాంతాల్లో బాలబడులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు,16మంది కి విద్య మెళుకువలు, నేర్పారు. అభినయాలు, గేయాలు, పాటలు, కథలు మరియు స్థానిక వనరులతో వస్తువులను తయారు చేసి కళారూపాలుగా ఎలా చూపించాలో నేర్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ గాడి శ్రీను, సంస్థ అధ్యక్షులు సీదరి శ్రీను, సంస్థ వైద్యులు డా. ఎం. రోహిత్, సంస్థ సిబ్బంది వంతాల రాజు, గణేష్, వికాస్ పాల్గొన్నారు.

పి అంకంపాలెం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా బుద్ధ విజయలక్ష్మి నామినేషన్.



జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి) మండలంలోని పి అంకంపాలెం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా బుద్ధ విజయలక్ష్మి మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద నామినేషన్ దాఖలు చేశారు . ఈ సందర్భంగా ఎక్స్ ఎంపీటీసీ నాలి శ్రీను మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ మరియు 7 వార్డులలో సభ్యులతో నామినేషన్ వేసినట్లు ఆయన తెలిపారు. పి అంకంపాలెం పంచాయతీ నీ అభివృద్ధి పదంలో ముందు ఉంచుతామని ఆయన తెలియజేశారు. కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు. బుద్ధ ఆదినారాయణ. పాలగాని నాగరాజు. దగ్గు మిల్లి ఆంజనేయులు. కూటమి నాయకులు పాల్గొన్నారు..

యర్రవరంలో కూటమి సర్పంచ్ అభ్యర్థి:

బస్సా త్రివేణి ప్రసాద్ ఎన్నికల ప్రచార జోరు.

ప్రత్తిపాడు నియోజకవర్గం.





ఏలేశ్వరం, నవంబర్ 17(మీ వార్త ప్రతినిధి) ఏలేశ్వరం మండలం, యర్రవరం గ్రామంలో, కూటమి పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బస్సా త్రివేణి ప్రసాద్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబి, బీజేపీ నాయకుల ఆశీస్సులతో సర్పంచ్ బరిలో నిలిచిన ఆమె ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే సత్యప్రభ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ గ్రామ సమగ్ర అభివృద్ధికి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో అడుగడుగునా మహిళలు స్వాగతం పలుకుతూ మంగళహారతులతో నీరాజనాలు అందిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, 10వ వార్డు అభ్యర్థి మైరాల కనకారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గంగిరెడ్ల గనిలక్ష్మి మణికంఠ, 11 వ వార్డు అభ్యర్థి ఆకుల నాని, తోట హరి, గ్రంధి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓగులాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం...





చిగురుమామిడి నవంబర్ 17 (మీ వార్త ప్రతినిధి సోన్నాయిల భరత్):
చిగురుమామిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓగులాపూర్ గ్రామంలో చిగురుమామిడి ఎస్ఐ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎస్ఐ జగదీష్ మాట్లాడుతూ ప్రజలు మంచి నడవడికతో, క్రమశిక్షణతో జీవించాలని, ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామంలోని యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు, మద్యం సేవనానికి దూరంగా ఉండాలని, ఇలాంటి అలవాట్ల వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు కూడా ఇబ్బందులకు గురవుతాయని తెలిపారు. అదేవిధంగా దొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లలో మరియు ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు, నేరస్తులను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.
ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ పిలుపునిచ్చారు...

ఘనంగా 'ఖేత్ బచావో అభియాన్ పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం

రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన



లింగపాలెం, నవంబర్ 17 (మీ వార్త విలేఖరి):
మండల పరిధిలోని ధర్మజిగూడెం గ్రామంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' (పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం), రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శనను సంయుక్తంగా నిర్వహించారు.
విజయరాయిలోని వ్యవసాయ పరిశోధనా స్థానం, ప్రధాన శాస్త్రవేత్త డా. కె. ఫణికుమార్, అధ్యక్షతన ఏరువాక కేంద్రం, ఏలూరు జిల్లా విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. నాగేంద్రబాబు ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖా వారి సమన్వయంతో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (=ూ=ూ) పరిశోధన సహ సంచాలకులు డా. ని.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, పంటల ఉత్పాదకత మరియు వ్యవసాయ ఆదాయాన్ని పెంపొందించే శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరం అసోసియేట్ డీన్ డా. కె.వి. రమణమూర్తి మాట్లాడుతూ, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, రైతులకు అందిస్తున్న సేవలు మరియు సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డా. ఫణి కుమార్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పొలం సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం, నీటి పొదుపు మరియు వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.
ఏలూరు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి ఉషాదేవి మాట్లాడుతూ, రైతులకు శిక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి ప్రదర్శనలు మరియు వ్యవసాయ విజ్ఞాన విస్తరణలో ఆత్మ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.
జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ ఎస్. రామ్‌మోహన్ మాట్లాడుతూ, బిందు మరియు తుంపర సేద్య పద్ధతుల ద్వారా నీటిని పొదుపు చేస్తూ, తక్కువ నీటితో అధిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.
వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరం ప్రొఫెసర్ మరియు అధిపతి డా. కె. వసంతభాను మాట్లాడుతూ, రైతులు పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తెగుళ్లు, పురుగులు మరియు కలుపు సమస్యలను శాస్త్రీయంగా నియంత్రించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ అదనపు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మహబూబ్ వల్లి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి వి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల (=ాఖ) ద్వారా అందించే సేవలు, సలహాలు మరియు పథకాలను వినియోగించుకోవాలని కోరారు.
వ్యవసాయ ప్రదర్శనలో వివిధ పంటల సాగు సాంకేతికతలు, నూతన వ్యవసాయ పరికరాలు మరియు రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు.
ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల ఉద్యాన అధికారిణి మొహమ్మద్ ఫర్హీన్, లింగపాలెం, ముసునూరు, పెదవేగి మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరం విద్యార్థుల తో పాటు వై ఎస్ ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన ఉద్యాన కళాశాల విద్యార్థులు , రైతులు మరియు మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాయకరావుపేట సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

ఈ నెల 20న నామినేషన్ కు ముహూర్తం ఖరారు



పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,నవంబరు 17 :
పాయకరావుపేట పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని కూటమి పార్టీల సర్పంచ్ అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ జిల్లా వాణిజ్య విభాగం మాజీ కోశాధికారి జూరెడ్డి ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి ఆశీస్సులు, కూటమి పార్టీ నాయకుల అండదండలతో తొలిసారి సర్పంచ్ అభ్యర్థిగా జూరెడ్డి ప్రసాద్ ఎన్నికల బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే. గత 35 సంవత్సరాల నుంచీ తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్న జూరెడ్డి ప్రసాద్ రాష్ట్రంలో జరిగిన ప్రతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి నిస్వార్థంగా కృషి చేశారు. మొదటి నుంచీ వివాదరహితుడు, సౌమ్యుడుగా పేరున్న జూరెడ్డి ప్రసాద్ పార్టీ సీనియర్ నాయకులతో సన్నిహితంగా మెలగుతూ పార్టీకి అత్యంత విధేయుడుగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోని క్లిష్ట సమయంలో కూడా పార్టీ మారకుండా పని చేసిన చరిత్ర జూరెడ్డి ప్రసాద్ కు ఉంది. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఈ ఎన్నికల్లో ప్రసాద్ గెలుపు ఖాయమని చెబుతున్నారు
ఈ సందర్భంగా కూటమి సర్పంచ్ అభ్యర్థి జూరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ... సర్పంచ్ పదవిపై ఆశతో కాకుండా గ్రామ అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. పట్టణ ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా సేవ చేసుకుంటానని విజ్ఞప్తి చేశారు. ఈనెల 20న కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులలో ప్రధానంగా తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదం, సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసే ఒక్క అవకాశం ఇవ్వాలని జూరెడ్డి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కోరుకొండలో నీరుకొండ బాబ్జి విస్తృత ప్రచారం

దశాబ్దాల రాజకీయ అనుభవంతో ప్రజాసేవకు సిద్ధం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం



కోరుకొండ నవంబరు 16 (మీ వార్త ప్రతినిధి)తూర్పుగోదావరి జిల్లారాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ మండలం కోరుకొండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీరుకొండ వర్ధనవిజయబాస్కర్(బాబ్జి) దృఢ సంకల్పంతో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..గత 30,40సంవత్సరాలుగా కోరుకొండ గ్రామ రాజకీయాల్లో తనకు అనుభవం ఉందని తెలిపారు.గ్రామంలోని ఏ వీధిలో ఏ సమస్య ఉందో తనకు పూర్తిగా తెలుసునని, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా ప్రజలు తనను సర్పంచ్‌గా ఎన్నుకున్నట్లయితే దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సమస్య,రహదారులు,కోతుల బెడద, శ్మశానవాటిక వంటి ప్రధాన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారానికి పూనుకుంటానని తెలిపారు.దశాబ్దాలుగా ప్రజలతో ఉన్న అనుబంధం,రాజకీయ అనుభవాన్ని గుర్తించి కోరుకొండ గ్రామ ప్రజలు తనకు మద్దతుగానిలవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లోఅమూల్యమైన ఓటు ముద్రనువేసి అఖండ మెజార్టీతోగెలిపించాలని నీరుకొండ బాబ్జి విజ్ఞప్తి చేశారు.

వార్డు మెంబర్ గా కూటమి అభ్యర్థి దివ్య నామినేషన్



లింగపాలెం, నవంబర్ 17 (మీ వార్త విలేఖరి):మండల పరిధిలోని మఠంగూడెం గ్రామ పంచాయతీ 1వ వార్డు మెంబర్ గా తెలుగుదేశం, బిజెపి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిని పంది దివ్య (మహేష్) మంగళవారం ధర్మాజిగూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాయల ప్రసాద్ , పంది మహేష్ బాబు, సాయిల ప్రేమ్ కుమార్, పొదిల మహేష్, అబ్బదాసరి మరియదాస్ , పొదిల గిరి, పొదిల వెంకటేష్, అబ్బదాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు





పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి నవంబరు 17 : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా మంగళవారం పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జూనియర్లకు గ్రంథాలయాల వినియోగంపై విద్యార్థి యొక్క పాత్ర, సీనియర్లకు పకృతి వైపరీత్యాలపై కలిగే నష్టాలు అనే అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకి ముఖ్య అతిథిగా విశ్రాంతి అధ్యాపకులు ఎస్ సీతారామమూర్తి, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎన్ టి సీతారామూర్తి, తేజోమూర్తుల వెంకటేశ్వర్లు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అప్పారావు మాస్టారు, పి శేషుబాబు విచ్చేసారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి లైబ్రేరియన్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాలా ఇష్టంతో ‘బిజిలీ’గా చేశా : రుహానీ శర్మ

ఆకాశంలో ఒక తార సినిమా కథకు తాను పర్సనల్ గా బాగా కనెక్ట్ అయ్యానని చెప్పారు హీరోయిన్ రుహానీ శర్మ. ఈ చిత్రంలో ఆమె బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా ఆధ్వర్యంలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించగా, స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సమర్పిస్తున్నారు. ఈ నెల 20 ఆకాశంలో ఒకతార సినిమా రిలీజ్ కు రాబోతోంది. రీసెంట్ గా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రుహానీ శర్మ స్పీచ్ స్పెషల్ అట్రాక్షన్ గా మారింది. హీరోయిన్ రుహానీ శర్మ మాట్లాడుతూ – ఆకాశంలో ఒక తార సినిమా కథకు నేను పర్సనల్ గా బాగా కనెక్ట్ అయ్యాను. ఈ కథలో అమ్మాయిలాగే నేను కూడా హిమాచల్ ప్రదేశ్ లోని ఒక ఊరి నుంచి వచ్చాను. నేను హీరోయిన్ గా మారి ఇలాంటి వేదిక మీద నిలబడి మాట్లాడతానని ఎవరైనా అప్పుడు చెప్పి ఉంటే నమ్మేదాన్ని కాదు. పరిస్థితుల కారణంగా మన కలల్ని చిన్నవి చేసుకోకూడదు. ఈ చిత్రంలో బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్ ను చాలా ఇష్టపడి చేశాను. క్యారెక్టర్ నిడివి ఎంత ఉంది అనేకంటే ఆ పాత్ర కథలో ఎంత కీలకంగా ఉందనేది చూసుకుంటాను. అందుకే ఈ రోల్ చేశాను. మీరంతా మా మూవీని, నా పర్ ఫార్మెన్స్ ను ఇష్టపడతారని నమ్ముతున్నాను’అన్నారు.

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్.. రమ్యకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు



చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందనే చర్చ ఎప్పటి నుంచో నడుస్తోంది. దీనిపై కొంతమంది తారలు బహిరంగంగా స్పందించారు కూడా. కొంతమంది తమకు అలాంటి పరిస్థితులు ఎదురుకాలేదని చెప్తే..మరికొంతమంది మాత్రం క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెబుతూ..తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్నారు. తాజాగా దీనిపై సీనియర్ నటి రమ్యకృష్ణ కూడా స్పందించింది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ‘క్యాస్టింగ్ కౌచ్ అనేది అప్పుడూ ఉంది. ఇప్పుడూ కొనసాగుతుంది. భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. ఈ విషయంలో నో చెప్పడానికి వీల్లేదు. దానికి ఓకే చెప్పాలా? నో చెప్పాలా? అనేది నీ చేతుల్లో ఉంది. బలవంతంగా, తప్పనిసరి పరిస్థితుల్లోనో లేదంటే ఇష్టపూర్వకంగానే ఇది జరగొచ్చు. మా ప్రొఫెషన్ గ్లామర్ ప్రపంచం చుట్టూ తిరుగుతుంటుంది.. ప్రజలు మా గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. కానీ బయట చాలా చోట్ల జరుగుతోంది. అన్ని డిపార్ట్‌మెంట్స్‌లోనూ, అన్ని రంగాల్లోనూ ఇది ఉంది. ప్రస్తుతం ఆడ, మగ తేడా లేకుండా జరుగుతోంది’ అని రమ్యకృష్ణ చెప్పుకొచ్చింది. రమ్యకృష్ణ సినీ కెరీర్ విషయానికొస్తే..80, 90 దశకాలలో దక్షిణాదిలో అగ్రనటిగా వెలుగొందారు. చిరంజీవి, నాగార్జున,వెంకటేష్, రజనీకాంత్ ఇలా ఎంతో మంది స్టార్ హీరోలతో కలిసి పని చేశారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధన్యమున్న రోల్స్‌తో అలరించారు. 40 ఏళ్ల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో వందలాది చిత్రాల్లో నటించారు. పెళ్లి తర్వాత కూడా నటిగా కొనసాగారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీ అయిపోయారు.

ఓటీటీలోకి ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ ‘418’.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కిన సరికొత్త భయానక హారర్ థ్రిల్లర్ చిత్రం ‘418’. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 23న థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను భయాందోళనకు గురిచేసింది. బిగ్ స్క్రీన్ పై ఈ సరికొత్త అనుభూతిని మిస్ అయిన హారర్ మూవీ ప్రియుల కోసం ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ గుడ్ న్యూస్ చెప్పింది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ఓటీటీలోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. నవంబర్ 19 నుంచి ఈ హారర్ థ్రిల్లర్ నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్-ఇండియా లెవెల్‌లో ఐదు ప్రధాన భాషల్లో ఈ చిత్రం డిజిటల్ ప్రేక్షకులను అలరించనుంది. చైత్ర జె ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి వెంకీ జీజీ సంగీతం అందించగా, ప్రశాంత్ నీల్ ప్రెజెన్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. కథ విషయానికి వస్తే.. సిటీకి దూరంగా ఉండే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఏళ్ల తరబడి మూసి ఉన్న ఆ హాస్టల్‌ను తిరిగి తెరిచినా, అందులోని ‘418’ నంబర్ గది మాత్రం అలాగే లాక్ చేయబడి ఉంటుంది. ఆ గది చుట్టూ అల్లుకున్న అతీంద్రియ శక్తులు, భయానక వాతావరణం, వివేక్ అనే విద్యార్థికి ఎదురయ్యే ఊహించని షాకింగ్ పరిణామాలు ప్రేక్షకులను సీట్లో కూర్చోనివ్వకుండా భయపెడతాయి. థియేటర్లలో ప్రేక్షకులను వణికించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

వన్ మోర్ ఛాన్స్.. కాల్పుల ఘటన తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టైగర్ ష్రాఫ్!



ముంబైలోని జుహులో తన కారుపై జరిగిన కాల్పుల ఘటన నుంచి తృటిలో తప్పించుకున్న బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ఎట్టకేలకు సోషల్ మీడియాలోకి రీఎంట్రీ ఇచ్చారు. నుష్రత్ భరూచాతో కలిసి నటిస్తున్న తన కొత్త మ్యూజిక్ సింగిల్ టీజర్‌ను ఆయన అభిమానులతో పంచుకున్నారు. అయితే, ఈ పోస్ట్‌కు ఆయన పెట్టిన “వన్ మోర్ ఛాన్స్, వన్ మోర్ డాన్స్” అనే క్యాప్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అక్టోబర్ 18న జరిగిన కాల్పుల ఘటన తర్వాత, ఆయన చేసిన ఈ పోస్ట్ జీవితంపై మరో అవకాశం అనే అర్థాన్ని ఇస్తోందంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గత నెల అక్టోబర్ 18న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ముగించుకుని కారులో వస్తున్న టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో టైగర్ ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఆయన డ్రైవర్ మరియు ఒక వ్యక్తి గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేపట్టి, నవంబర్ 15 నాటికి సుమారు 14 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ తీవ్రమైన ఘటన తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉన్న టైగర్ ష్రాఫ్, ఇప్పుడు తన కొత్త ప్రాజెక్ట్‌తో తిరిగి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడిన తర్వాత చేసిన ఈ పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది

విజయ్ దేవరకొండ ‘రణబాలి’కి ఓటీటీలో అద్భుతమైన స్పందన

నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్!



విజయ్ దేవరకొండ హీరోగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’ ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. థియేటర్ల తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అడుగుపెట్టిన ఈ చిత్రానికి ఊహించని విధంగా భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులతో పాటు వివిధ భాషల ప్రేక్షకులు ఈ సినిమాపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు. ఈ చిత్రంలో చూపించిన చారిత్రక సంఘటనలు, బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చకు దారితీశాయి. కొంతమంది బ్రిటన్ నెటిజన్లు సినిమాలో చూపించిన బ్రిటిష్ పాలన విధానాలపై స్పందిస్తుండగా, మరికొందరు వలసవాద పాలనలో భారతీయులు పడిన నష్టాలు మరియు జరిగిన దారుణాలను గుర్తుచేస్తూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, పవర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా అద్భుతంగా నటించారని నెటిజన్లు కొనియాడుతున్నారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ టేకింగ్, చరిత్రను నిజాయితీగా తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసల జల్లు కురుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించగా, టి-సిరీస్ సమర్పించింది. మొత్తానికి ఓటీటీలో వస్తున్న రెస్పాన్స్‌తో ‘రణబాలి’ సినిమా సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది.